క్లుప్తంగా

విద్యుత్తు అంతరాయంపై ఆందోళన


ఎండిపోతున్న చెరకు ముచ్చులు

మునగపాక: మండలంలోని గణపర్తిలో వ్యవసాయ విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో చెరకు రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ రంగానికి ఇచ్చే విద్యుత్తు రెండు రోజులుగా నిలిచిపోవడంతో చెరకు ముచ్చులు ఎండిపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోటార్లు పనిచేయక పశువులకు తాగు నీరు అందించడం ఇబ్బందికరంగా ఉంటుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి వ్యవసాయ రంగానికి ఇచ్చే విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పశువులకు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

భగవద్గీత శ్లోకాలపై శిక్షణ


భగవద్గీత శ్లోకాలు నేర్చుకుంటున చిన్నారులు

మునగపాక: తోటాడలో ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమంలో భగవద్గీత శ్లోకాల శిక్షణ కార్యక్రమం నిర్విరామంగా సాగుతోంది. ఓంకార పీఠం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఈ శిక్షణకు పిల్లలు, పెద్దలు హాజరవుతున్నారు. భగవద్గీత శ్లోకాలపై తమకు అందిస్తున్న శిక్షణ అన్ని విధాలా దోహదపడుతుందని శిక్షకులు శ్రీనివాసరావు, లలిత తదితరులు తెలిపారు.

చురుగ్గా మురుగు కాలువ నిర్మాణం


దిమిలిలో పనులు చేస్తున్న కూలీలు

రాంబిల్లి: దిమిలి గ్రామంలో మురుగుకాలువల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలోని పలు వీధుల్లో కాలువలు లేక రోడ్లుపై మురుగు ప్రవహిస్తోంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ బంగారు చిలుకు, పంచాయతీ కార్యదర్శి జి.రాజుబాబు స్పందించి మురుగుకాలువ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఈ కాలువల నిర్మాణం పూర్తయితే మురుగు సమస్య తీరుతుందని, రోడ్లపై సౌకర్యవంతంగా రాకపోకలు సాగించే అవకాశం ఉంటుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

రాంబిల్లి: సెజ్‌లో టీజే కంపెనీ ప్రతినిధులు ఆదివారం రాంబిల్లిలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువతీయువకులు ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సెజ్ ఏర్పాటు చేయడంతో వేలాది మంది ఇక్కడి పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్నారన్నారు. స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యంలో 380 మందికి నేత్ర పరీక్షలు

అచ్యుతాపురం: బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 380 మందికి ఆప్తాలమిస్టులు కంటి పరీక్షలు నిర్వహించారు. బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన 122వ కంటి వైద్య శిబిరంలో 237 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. 95 మందికి ఉచితంగా మందులు అందజేశారు. 30 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని సూచించారు. బ్రాండెక్స్‌లో నిర్వహించిన శిబిరానికి విచ్చేసిన వారిని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి పరామర్శించారు. శిబిరానికి విచ్చేసిన కంటి బాధితులకు మజ్జిగ, ఫలహారం, భోజన సదుపాయాలు కల్పించారు.

అభివృద్ధి పథంలో తిమ్మరాజుపేట

- మారిన గ్రామ రూపురేఖలు
- అందుబాటులోకి ప్రభుత్వ భవనాలు
- సేవల పట్ల సర్వత్రా హర్షం
- రూ.4.43 కోట్లతో అభివృద్ధి
- రూ.12.21 కోట్ల సంక్షేమ లబ్ధి


తిమ్మరాజుపేటలో అందుబాటులోకి వచ్చిన సంపద తయారీ కేంద్రం




నాడు-నేడు కింద రూపురేఖలు మారిన ప్రభుత్వ పాఠశాల

మునగపాక: ఒకప్పుడు అభివృద్ధికి ఆమడదూరంలో ఉండే తిమ్మరాజుపేట గ్రామం రూపురేఖలు మారిపోయాయి. గతంలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిష్కారమయ్యాయి. గత టీడీపీ హయాంలో కానరాని అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ప్రగతి దర్శనమిస్తోంది. దీంతో గ్రామంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ద్వారా అందుతున్న సేవల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.4.43 కోట్లతో అభివృద్ధి.....

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిమ్మరాజుపేటలో పలు అభివృద్ధి పనులకు రూ.4.43 కోట్లు ఖర్చు చేశారు. దీనికి తోడు సంక్షేమ పథకాల ద్వారా రూ.12.21 కోట్ల మేర డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అయింది. రూ.43 లక్షలతో సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.5 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్‌కు, రూ.16 లక్షలతో డిజిటల్ లైబ్రరీ, మొదట విడత నాడు - నేడు కింద ప్రాథమిక పాఠశాలకు రూ.18 లక్షలు, రెండో విడత కింద హైస్కూల్‌కు రూ.45 లక్షలు, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయిల నిమిత్తం రూ.35 లక్షలు, రూ.10 లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధి, పలు చోట్ల లక్షలాది రూపాయలతో రహదారులు, డ్రెయిన్లు నిర్మించారు. గతంలో రైతులు తయారు చేసుకున్న బెల్లాన్ని మార్కెట్‌కు తరలించేందుకు రహదారి సదుపాయం లేక అవస్థలు పడేవారు. నేడు ఆటోల ద్వారా మార్కెట్‌కు బెల్లం తరలించేందుకు అనువైన రహదారులు అందుబాటులోకి వచ్చాయి. సంపద తయారీ కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడింది. 2,542 మంది జనాభా, 1,780 మంది ఓటర్లు, 10 వార్డులున్న తిమ్మరాజుపేట నేడు అభివృద్ధి వైపు పరుగులు తీస్తోంది. మొత్తం మీద సంక్షేమం, అభివృద్ధి పనులకు రూ.16 కోట్లకు పైగా ప్రభుత్వం నిధులను కేటాయించింది.

ప్రభుత్వ భవనాల వ్యయం ఇలా..

సచివాలయం	రూ.43లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.21.8లక్షలు
జలజీవన్ మిషన్ కింద	రూ.35లక్షలు
మనబడి నాడు-నేడు(తొలివిడత)	రూ.18లక్షలు
మనబడి నాడు-నేడు(రెండో విడత)	రూ.45లక్షలు
2మంది ఇళ్ల లబ్ధిదారులకు	రూ.2కోట్లు


తిమ్మరాజుపేటలో రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయం


తిమ్మరాజుపేటలో నిర్మించిన రహదారి


రూ.10 లక్షలతో నిర్మించిన శ్మశాన వాటిక


ఆర్‌బీకే ద్వారా అందుతున్న సేవలు


నూతనంగా నిర్మించిన డ్రైనేజీ

పూర్తిస్థాయిలో మౌలిక వసతులు



తిమ్మరాజుపేటకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పిస్తున్నాం. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సహాయ, సహకారాలతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ప్రజలకు అవసరమయ్యే సంక్షేమ పథకాలందాయి. అభివృద్ధి కనిపిస్తోంది. గ్రామస్తుల సహకారంతో తిమ్మరాజుపేటను మరింత ఆదర్శంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తా.

భీమరశెట్టి మంగలక్ష్మి, సర్పంచ్, తిమ్మరాజుపేట

మునుపెన్నడూ లేని అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. మునుపెన్నడూ జరగని అభివృద్ధి నేడు దర్శనమిస్తోంది. రహదారులు, డెయిన్లు అభివృద్ధి చెందుతున్నాయి. తిమ్మరాజుపేట రూపు రేఖలు మారుతున్నాయి.

– శరగడం అప్పలనరసమ్మ, ఎంపీటీసీ

అందుబాటులో ప్రభుత్వ సేవలు



ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. గతంలో ప్రభుత్వ సేవలు కావాలంటే మండల కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. నేడు సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు దొరుకుతున్నాయి. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి.

– మళ్ల సత్యనారాయణ,తిమ్మరాజుపేట

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

మునగపాక: స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో కండక్టర్ రీప్లేస్ మెంట్‌లో భాగంగా సోమవారం సరఫరా నిలిపివేస్తున్నట్టు కొంకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని అరబుపాలెం, వాడ్రాపల్లి, గొల్లలపాలెం, పాత నాగవరం, కొత్త నాగవరం తదితర గ్రామాల్లో ప్రజలు సహకరించాలన్నారు.

నేడు పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

కోటవురట్ల: మండలంలో సోమవారం పలు అభివృద్ధి పనులను నియోజకవర్గ ఇన్‌చార్జి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ప్రారంభించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు అన్నవరంలో అభివృద్ధి పనులను ప్రారంభించి, అక్కడి నుంచి రామచంద్రపాలెం, బోడపాలెం, కె.వెంకటాపురం, రాజుపేట, చౌడువాడ, పందూరు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, సచివాలయాలు, సీసీ రోడ్లు, తదితర అభివృద్ధి పనులను ప్రారంభిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేటికీ ద్వితీయ శ్రేణి పౌరులుగానే మహిళలు

అనకాపల్లి: అన్ని మతాలు మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగానే చూస్తున్నాయని, వంటింటికి పరిమితం చేయాలని చూస్తున్న పరిణామాలను తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. సుబ్బారావమ్మ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి. ప్రభావతి పిలుపునిచ్చారు. శ్రామిక మహిళ సమన్వయ కమిటీ, ఐద్వా, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, సావిత్రిబాయిపూలే వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఇక్కడ సదస్సుకు ముఖ్యఅతిథిగా వారు హాజరై మాట్లాడారు. మహిళలు తమ హక్కుల కోసం ప్రపంచ వ్యాప్తంగా పోరాడారన్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు దూసుకెళ్తున్నప్పటికీ బానిసలుగానే చూస్తున్నారని వాపోయారు. రోజురోజుకీ మహిళలపై లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఐక్యంగా అందరం పోరాడాలని, శ్రామిక మహిళలు ఇంటిపని, బయటి పనులతో మరింత ఒత్తిడికి గురవుతున్నారని వాపోయారు. ఐద్వా జిల్లా కార్యదర్శి డీడీ వరలక్ష్మి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి


పెంటకోట సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్


బూత్ కన్వీనర్లతో కలిసి కిట్లు ప్రదర్శిస్తున్న బొడ్డేడ ప్రసాద్, సమన్వయ కర్త కంబాల జోగులు

- పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, సమన్వయకర్త కంబాల జోగులు

పాయకరావుపేట: ప్రతీ బూత్ కమిటీ కన్వీనర్ ఎన్నికలకు సిద్ధం కావాలని, త్వరలో సార్వత్రిక ఎన్నికల సమయం వచ్చిందని నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పాయకరావుపేట పట్టణంలోని జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా కార్యాలయంలో, పెంటకోట గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు స్వగృహంలో వేర్వేరుగా బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశం జరిగింది. పట్టణ సమావేశంలో సమన్వయకర్త కంబాల జోగులు మాట్లాడుతూ ప్రతీ బూత్ కన్వీనర్ ప్రణాళిక బద్ధంగా ఓట్లు వేయించుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరలా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే మనందరం ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అనంతరం బూత్ కన్వీనర్లకు కిట్లు పంపిణీ చేసారు. పెంటకోటలో కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ హాజరై మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ప్రతీ ఓటరుతో ఓటింగ్ చేయించుకోవలసిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. ఈ సమావేశాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండలాధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక నూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి వేమగిరి లక్ష్మణ్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి దేవవరపు రాజేష్ ఖన్నా, సర్పంచ్‌లు వన్నీరు బాబ్జి, వడాల సోమన్నదొర, కోడ కోటేశ్వరరావు, గెద్దమూరి శ్రీనివాసరావు, మేడిశెట్టి రామగోవిందు, నకిలేటి రాము, యన్నం రెడ్డి లోవరెడ్డి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి వై.అన్నవరం, మండల బీసీ సెల్ అధ్యక్షుడు పక్కుర్తి లోవకుమార్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కొంకిపూడి రామకృష్ణ, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ బోడిపల్లి శ్రీను, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఆయా బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యం


మామిడివాడలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

రాంబిల్లి: మామిడివాడలో ఆదివారం మేము సిద్ధం ..మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేసేందుకు పలు సూచనలు, సలహాలను జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.శ్రీనుబాబు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం. అప్పలనర్స, నాయకులు నెట్టెం సత్యనారాయణ, ఎస్. సన్యాసిరావు, సచివాలయ కన్వీనర్ ఎం. రాంఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

120 మంది యువకుల రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

ఎస్.రాయవరం: మానవ సేవే మాధవ సేవగా తలచి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు శానాపతి బాబూరావు తెలిపారు. తన కుమార్తె కుసమకావ్య జ్ఞాపకార్థంగా కుసుమ కావ్య ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆదివారం అడ్డురోడ్డులో పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మంది యువకులు రక్తదానం చేశారు. ఇదే క్రమంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలకు సహాయ సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానికులు సహాయ సహకారాలు అందించారు.

సిద్ధం సభతో ప్రతిపక్షాల గుండెల్లో దడ

- మళ్లీ అధికారం వైఎస్సార్‌సీపీదే
- సమన్వయకర్త కంబాల జోగులు


రాజయ్యపేటలో మాట్లాడుతున్న సమన్వయకర్త జోగులు

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ నిర్వహించిన సిద్ధం సభలతో ప్రతిపక్ష పార్టీల గుండెల్లో దడ పట్టుకుందని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. అద్దంకిలో సిద్ధం సభ చూసి, చలిజ్వరం మొదలైందని ఎద్దేవా చేశారు. ఆదివారం రాజయ్యపేటలో ఆయన మాట్లాడుతూ యువగళం, శంఖారావం సభలకు గ్రాఫిక్స్‌లో సెట్ చేసి జనాలను చూపించుకున్నారని, సిద్ధం సభలకు మాత్రం వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టాయన్నారు. లక్షలాది మంది తరలి వచ్చారన్నారు. నలభై ఏళ్ల అనుభవం, మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి సినిమా యాక్టర్‌ను పట్టుకుని బీజేపీతో పొత్తు కోసం ఢిల్లీ వీధుల్లో రేయింబవళ్లు రోడ్లపైన తిరుగుతూ, నేతల ఇళ్లు, పార్టీ కార్యాలయాల ముందు పడిగాపులు పడటం సిగ్గుచేటన్నారు. ఐదు కోట్ల తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో తాకట్టు పెట్టేశారని విమర్శించారు. చంద్రబాబు వయసుకు తగ్గ పనులు చేయడం లేదన్నారు. కేవలం అధికార యావతో ఎంతకైనా దిగజారుతారనడానికి తాజా పరిణామాలే నిదర్శనమన్నారు. టీడీపీతో పొత్తు కోసం బీజేపీ ఏనాడూ వెంపర్లాడలేదన్నారు. చంద్రబాబునాయుడు తన ఆత్మరక్షణ, కేసుల నుంచి తప్పించుకోవడం కోసం బీజేపీ ముందు మోకరిల్లారన్నారు. అధికారంలోకి రాకపోతే జైలు పాలవకుండా కాపాడటం కోసమే పొత్తులు పెట్టుకుంటున్నారని దుయ్యబట్టారు. ఇంతటి దిగజారుడు నాయకుడ్ని రాష్ట్ర చరిత్రలో చూడలేదన్నారు. సిద్ధం సభల్లో లక్షలాది మంది అభిమానులు పాల్గొనడం చూసి తట్టుకోలేక టీడీపీ, జనసేన పార్టీల్లో సంఘర్షణ మొదలయిందన్నారు. ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా జగనన్న మాత్రం సింగిల్‌గానే పోటీ చేస్తారన్నారు. ప్రజలకు మంచి చేశానని అనిపిస్తేనే వచ్చే ఎన్నికల్లో తనకు ఓటేయాలని సిద్ధం సభల్లో ధైర్యంగా చెబుతున్న జగనన్నను చూస్తుంటే చాలా గర్వంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ పొత్తు ప్రజలతోనేనన్నారు. ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే సత్తా, ధైర్యం తమ పార్టీకే ఉందన్నారు. బూటకపు హామీలిస్తున్న చంద్రబాబును ఆదరిస్తారో, ఇచ్చిన వాగ్దానాలను నూరుశాతం నెరవేర్చిన జగనన్న కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాసులమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, నాయకులు నాగేశు, బాబూరావు, సూరిబాబు, బాబ్జి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి పాటుపడాలి


మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: దళితుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక బీసీ కాలనీలో పూర్వపు హాస్టల్ ప్రాంగణంలో ఆదివారం మండల స్థాయి దళితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. దళితవాడలను పంచాయతీలుగా గుర్తించాలన్నారు. వీటి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఎన్నికలు సమీపించే వేళ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని మే నెలలో నిర్వహించేలా నిర్ణయించామన్నారు. ఇటీవల మునగపాకలో బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌పై పోలీసులు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటామన్నారు. అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో దళిత నేతలు కోనపల్లి రామ్మోహనరావు, పిల్లి అప్పారావు, గుంట్ల అప్పారావు, పోతురాజు, దిమ్మల శివ, లంబా అప్పారావు, గెంజి శ్రీనివాసరావు, పిట్టా అప్పారావు పాల్గొన్నారు.

తీరంలో పుణ్యస్నానాలు


పెంటకోట తీరంలో స్నానాలు చేస్తున్న భక్తులు


పాల్మన్‌పేట తీరంలో ..

పాయకరావుపేట: అమావాస్య సందర్భంగా భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. శని, ఆదివారాలు కూడా అమావాస్య ఉండటంతో తుని, కోటనందూరు, పాయకరావుపేట మండలాలకు చెందిన పలువురు భక్తులు పెంటకోట, పాల్మన్‌పేట, వెంకటనగరం, రాజవరం తదితర సముద్ర తీర ప్రాంతానికి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. మెరైన్ పోలీసులు ఆయా తీర ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ధారమఠం శివుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ధారమఠం శివుడు

గొలుగొండ: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం భక్తులు ధారమఠం మహా శివుడిని దర్శించుకున్నారు. జలపాతాల వద్ద స్నానాలు ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. అలాగే కుటుంబ సమేతంగా వచ్చిన వారు అక్కడే వంటా వార్పు చేసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ, పోలీస్ సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేశారు.

సామాజిక సేవలు అభినందనీయం

అనకాపల్లి: మహిళా సాధికారతకు కృషి చేస్తున్న లయన్స్ క్లబ్, స్పందన చేయూత ఫౌండేషన్ సేవలు అభినందనీయమని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జానకిరామరాజులు పేర్కొన్నారు. జీవీఎంసీ 82వ వార్డు గాంధీనగరం లయన్స్ క్లబ్ హాలులో ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా సాధికారత సదస్సులో వారు మాట్లాడారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మహిళలు స్వయం ఉపాధి పొందడానికి స్పందన చేయూత చేస్తున్న సేవలు శ్లాఘనీయమన్నారు. క్లబ్ విశాఖ క్యాన్సర్, నేత్ర ఆస్పత్రుల ద్వారా రోగులకు సేవలను అందజేస్తోందని చెప్పారు. మూడో విడత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండో బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. శిక్షణలో అభ్యర్థులు కుట్టిన, తయారు చేసిన వస్త్రాల ప్రదర్శనను వారు తిలకించారు. క్లబ్ శాఖ అధ్యక్షుడు వెంకటరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ పూర్వపు గవర్నర్ వీఎస్ నూకరాజు, స్పందన చేయూత ఫౌండేషన్ చైర్మన్ ఇ.బుచ్చిరాజు, క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ పూసర్ల సునీల్, మహిళా సాధికారత కన్వీనర్ దండు ఝాన్సీ, లక్ష్మి, క్లబ్ ప్రతినిధులు రాజు, వినోద్‌కుమార్, మధు, మూర్తి, శర్మ, స్వామి, సీతారామరాజు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.